షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 240 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 5 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 240 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 31 july 2024 PAGES : 8 PRICE : 3/-



## ఏదైనా పథకాన్ని ఆపి అయినా ఈ హామీలు నెరవేరుస్తాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు మాట్లాడుతున్నాయని విమర్శ
- అన్ని సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తామన్న మంత్రి
- రైతుకు ఇబ్బంది కలగవద్దని రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారన్న మంత్రి

హైదరాబాద్

ఆర్థికంగా కష్టమైనా... ఏదైనా ఒక పథకాన్ని ఆపి అయినా సరే రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమాను అమలు చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రుణమాఫీ కాలేదంటూ కేటీఆర్ విమర్శలు చేయడంపై మంత్రి స్పందిస్తూ... గతంలో రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు ఇప్పుడు మాట్లాడుతున్నాయని విమర్శించారు. రైతులు ఆదరిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఏదైనా పథకాన్ని ఆపి అయినా సరే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. అన్ని సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు కచ్చితంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ - మిగతా 3లో

# సరికొత్త వ్యూహం

- ప్రతిపక్షాలను ఢీ కొనేందుకు పక్కా ప్లాన్
- రైతు రుణమాఫీ నుంచి మూసీ సుందరీకరణ వరకు ప్రతీ అంశంపై అపోజిషన్ నుంచి ప్రెజర్ ఎదుర్కోటోంది అధికార పార్టీ.
- విపక్షాల విమర్శలను తిప్పికొట్టకపోతే జనం నుంచి మరింత వ్యతిరేకత వ్యక్తం అవుతుందని.. దీన్ని సాధ్యమైనంత త్వరగా యాక్షన్‌కు రియాక్షన్ ఉండాలని భావిస్తోంది.
- విపక్షాల విమర్శలను ఎలా తిప్పికొట్టాలనే దానిపై మేధోమధనం చేస్తోంది
- అందుకోసం సరికొత్త వ్యూహంతో ముందుకెళ్లాలని చూస్తోంది కాంగ్రెస్.



హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు కావొస్తుంది. రైతు రుణమాఫీ నుంచి మూసీ సుందరీకరణ వరకు ప్రతీ అంశంపై అపోజిషన్ నుంచి ప్రెజర్ ఎదుర్కోటోంది అధికార పార్టీ. ఈ అంశాలపై జనంలో కూడా తీవ్ర చర్చనీయాంశం అవుతుండటంతో కాంగ్రెస్ పార్టీ అలర్ట్ అయింది. విపక్షాల విమర్శలను తిప్పికొట్టకపోతే జనం నుంచి మరింత వ్యతిరేకత వ్యక్తం అవుతుందని.. దీన్ని సాధ్యమైనంత త్వరగా యాక్షన్‌కు రియాక్షన్ ఉండాలని భావిస్తోంది. అందుకోసమే ఈ మధ్య కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశం ఏర్పాటు చేసింది. కొత్త పీసీసీ చీఫ్‌కు సన్మానం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపైనే చర్చించారు. ప్రభుత్వంలో భాగస్వామ్యమైన కార్పొరేషన్ ఛైర్మన్లతో పీసీసీ చీఫ్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఇప్పటి దాకా ఓ లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క అంటోంది తెలంగాణ కాంగ్రెస్. అంటే పద్ధాం.. అపోజిషన్ కదా అని వదిలేశాం..ఇక కథ వేరే ఉంటదని చెప్తోంది. ప్రతిపక్షాల మాటకు ధీటుగా - మిగతా 3లో

# కాంగ్రెస్ ట్రాప్‌లో బీఆర్ఎస్

- కొండా సురేఖను డిఫెండ్ చేయడానికి కాంగ్రెస్ కూడా రెడీ అవుతోంది
- ఇంటే రాజకీయం పూర్తిగా మారిపోయిందన్నమాట
- మంత్రిగా ఉన్న కొండా సురేఖ అత్యంత సీనియర్ నేత.
- కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో ఒక్క సారిగా సీన్ మారిపోయింది
- ఇప్పుడు బీఆర్ఎస్ టాపిక్ డైవర్ట్ కాకుండా అసలు అంశాన్ని లైవ్‌లో ఉంచుకునేందుకు వ్యూహాత్మక రాజకీయం చేయాల్సి ఉంది




హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో బుధవారం మధ్యాహ్నం వరకూ హైడ్రా కూల్చివేతలు, మూసీ కూల్చివేతలపై చర్చే. కానీ కొండా సురేఖ ఎప్పుడు అయితే కేటీఆర్ ను కౌంటర్ చేయడానికి సిన ఫ్యామిలీస్ ను.. హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్‌ను తెరపైకి తెచ్చారో అప్పుడే సీన్ మారిపోయింది. బీఆర్ఎస్ నేతలంతా కొండా సురేఖపై విరుచుకుపడుతున్నారు. ఆమె వ్యక్తిగత ఆడియో రికార్డును పోస్టు చేస్తున్నారు. మహిళా నేతలు భారీ కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. కొండా సురేఖను డిఫెండ్ చేయడానికి కాంగ్రెస్ కూడా రెడీ అవుతోంది. ఇంటే రాజకీయం పూర్తిగా మారిపోయిందన్నమాట. మంత్రిగా ఉన్న కొండా సురేఖ అత్యంత సీనియర్ నేత. ఆమెకు రాజకీయాల్లో ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలుసు. - మిగతా 3లో



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- 14 మంది మావోయిస్టులు మృతి
- దంతెవాడ-నారాయణపూర్ సరిహద్దులో కాల్పుల మోత
- నెత్తురోడిన అబూజ్ మాడ్ అటవీప్రాంతం
- భారీగా ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

-2లో

## బీహార్‌లో మళ్లీ చెడుతున్న బీజేపీ-జేడీయూ బంధం



- నితీశ్ ప్రధాని అవుతారన్న మంత్రి జమాఖాన్...
- నితీశ్ కుమార్ ప్రధాని అయితే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్న మంత్రి జమాఖాన్
- ప్రధాని కుర్చీ ఖాళీ లేదన్న బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అజయ్ అలోక్
- బీహార్‌లో నితీశ్‌ను గద్దెదింపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న ఆర్జేడీ



## షాంఘై సదస్సుకు పాక్ వెళ్తున్న జైశంకర్

- అక్టోబర్ 15, 16న పాకిస్తాన్‌లో కేంద్రమంత్రి జైశంకర్ పర్యటన
- ఇస్లామాబాద్ వేదికగా వార్షిక షాంఘై సహకార సంఘం సమావేశం
- ఎస్సీవో సదస్సుకు ఆతిథ్యమిస్తున్న పాక్
- ఈ సమావేశానికి హాజరుకానున్న జైశంకర్

# ఒక్క బస్సు తప్ప ఆరు గ్యారెంటీలు తుస్సే

- అవసరమైతే రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేసి.. రుణమాఫీ చేయిస్తా
- దసరా పండుగలోపు రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలి
- ప్రభుత్వం మాటలు నమ్మి రూ. 2 లక్షలపైన అప్పు కడితే రుణమాఫీ కాలేదు
- రేవంత్ రెడ్డి ఇంకెప్పుడు చేస్తావ్. నీకు చెవులు, కళ్ళు ఉంటే చేయ్
- రేవంత్ రెడ్డి మొనగాడు కాదు..
- మోసగాడు అని తేలిపోయింది

మహబూబాబాద్

దసరా పండుగలోపు రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని బీఆర్ఎస్ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. అవసరమైతే దసరా పండుగ తర్వాత ఢిల్లీకి పోయి రాహుల్ గాంధీ ఇంటి ముందు కూడా ధర్నా చేస్తాం. వరంగల్ డిక్లరేషన్‌లో మాటిచ్చిన ప్రకారం.. రుణమాఫీ చేస్తావా.. చెయ్యవా.. అని రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేసి మీకు రుణమాఫీ చేయిస్తాను. విడిచిపెట్టే ప్రసక్తే లేదు.. మీరు ధైర్యంగా ఉండండి అని రైతులకు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఒక్క బస్సు తప్ప ఆరు గ్యారెంటీలు తుస్సే అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం మాటలు నమ్మి రూ. 2 లక్షలపైన అప్పు కడితే - మిగతా 3లో



# దసరాకు ఇస్తామన్న పెండింగ్ డీఏ లను ఇయ్యండయ్యా

**-రావికంటి పవన్ కుమార్**
**అసోసియేట్ ప్రెసిడెంట్ టి ఆర్ టి ఎఫ్**



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు అక్టోబరు 04 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం జూలై 2022 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు పెండింగ్ డిఏ లను వెంటనే ప్రకటించాలని 'తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్' అసోసియేట్ ప్రెసిడెంట్ రావికంటి పవన్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోరుట్లలో జరిగిన సమావేశంలో పవన్ కుమార్ మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు అన్యాయం చేసిందని దానిని సవరించి వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు డిఏ లు ప్రకటించాలని పదేళ్ల నుంచి ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని సవరించి ప్రజా పాలన ఫలాలు అందించాలని పవన్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఆరు నెలలకు ఒకసారి డిఏ ఇవ్వాల్సిందేనని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇది తప్పనిసరని ప్రభుత్వం ఇది గమనించి తక్షణం డిఏ లను ప్రకటించాలని పవన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుంగూరి సురేష్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ గంగుల రణధీర్ విజయానందరావు తూదూరి సతీష్ గౌడ్ కోరుట్ల రాజ్ కుమార్ మంచికట్ల లక్ష్మీకాంతం సిరాజ్ భూమేశ్వర్ యాగండ్ల గంగాధర్ ఎం.సత్యానారాయణోటగిరి హరీష్ గుండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల పెద్ద గుండు వద్ద మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహ ఆవిష్కరణ





**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి అక్టోబరు 04:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ పశు వైద్య కళాశాల ముందు ఏర్పాటు చేసిన స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు రత్నాకర్ రావు కుమారులు జువ్వాడి నర్సింగ్ రావు కృష్ణారావు లు స్థానిక నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆవిష్కరించారు తదనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రతి గుడిలో ధూప దీప నైవేద్యం జువాడి రత్నాకర్ రావు ఆశయమని అది నేటికీ కొనసాగుతుందని అదేవిధంగా రైతు నేతగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన నాయకుడిగా ప్రజల మన్నలను పొందిన మహోన్నత వ్యక్తిగా నిలిచారని కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి జువ్వాడి రత్నాకర్ రావు ఎనలేని కృషి చేశారని ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఎమ్మెల్సి భాను ప్రసాద్ భువనగిరి ఎంపీ కిరణ్ రెడ్డి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్ మాజీ ఎమ్మెల్యే ఆరపెల్లి మోహన్ కొండూరి రవీందర్ రావు కూన శ్రీశైలం గౌడ్ బొమ్మ శ్రీరామ్ జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఆడువాలా జ్యోతి కోరుట్ల మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతి రెడ్డి ఇబ్రహీంపట్నం కోరుట్ల మల్లాపూర్ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ లు నియోజకవర్గ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు రత్నాకర్ రావు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మద్యం మత్తులో భార్యను చీరతో ఉరేసి హత్య చేసిన భర్త





**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి అక్టోబరు 04:** మద్యం మత్తులో భార్యను ఉరేసి హత్య చేసి చంపిన భర్త సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండల పరిధిలోని రేపాక గ్రామంలో చోటుచేసుకుంది. అడ్డగూడూరు ఎస్సై డి నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు తండ్రి సంగు రాజిరెడ్డి తండ్రి మల్లారెడ్డి అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. రేపాక గ్రామానికి చెందిన బోనగ స్వరూప కు అదే గ్రామానికి చెందిన కృష్ణా రెడ్డి తో వివాహం జరిగింది దంపతులకు ఒక కుమార్తె (8) కృష్ణారెడ్డి మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడే వారన్నారు ఉదయం గొడవ పడి బయటికి వెళ్లి ఫుల్లుగా మద్యం సేవించి మధ్యాహ్నం ఇంటికి వచ్చి భార్యను మద్యం మత్తులో చీరతో మెడకు ఉరివేసి హత్య చేశాడని తెలిపారు. మృతురాలి తండ్రి సంగు రాజి రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి నాగరాజు తెలిపారు

## సర్వరాజ్ పూర్ లో హెల్త్ కార్డు సర్వేను పర్యవేక్షించిన మెట్ పల్లి ఆర్డీవో నక్క శ్రీనివాస్



**షణ్ముఖ వెలుగు రూరల్ ప్రతినిధి అక్టోబరు 04 :** కోరుట్ల మండలంలోని సర్వరాజ్ పూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న హెల్త్ కార్డుల కోసం సర్వే పనులను మెట్ పల్లి ఆర్డీవో నక్క శ్రీనివాస్ కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణ పర్యవేక్షించారు ఒక కుటుంబానికి ఒక డిజిటల్ కార్డును ఇవ్వనున్నట్లు అదే కార్డులో మల్టీ పర్పస్ గా అనేక సౌకర్యాలు పొందేలా రూపొందిస్తున్నట్లు పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని సర్వరాజ్ పూర్ గ్రామాన్ని మొట్ట మొదటిగా ఎంపిక చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ సర్వే ప్రారంభించారు అని తెలిపారు

## దళిత బిడ్డకు డాక్టరెట్ విజ్ఞానం ఎవరి సొత్తు కాదని నిరూపించిన దినేష్



**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి అక్టోబరు 04:** చిన్నప్పటినుండి దేశం తనకేమిచ్చింది అనుకోకుండా తాను దేశానికి సమాజానికి ఏదో ఇవ్వాలని తల్లిదండ్రుల పేరు నిలపాలని దృఢ సంకల్పంతో ఉన్నత విలువలతో చక్కని క్రమశిక్షణతో విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందిన కోరుట్ల విద్యార్థి దినేష్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. కోరుట్ల పట్టణం లోని అణగారిన వర్గాల్లోని ఆణిముత్యం మోచి కులానికి చెందిన ఓటరికారి ఉపేందర్ - అరుణ దంపతుల కుమారుడు డాక్టర్ ఓటరికారి దినేష్ హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి కెమిస్ట్రీ విభాగం లో తాను చేసిన పరిశోధనలకు గాను బెస్ట్ థీసిస్ అవార్డు తో పాటు గౌరవ డాక్టరెట్ ను అందుకున్నాడు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నిర్వహించిన 24వ స్నాతకోత్సవంలో భాగంగా డాక్టర్ కామేశ్వరి దేవి మెమోరియల్ అవార్డు పేరు మీదుగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జగదీశ్వర్ రావు చైర్మన్ సీతారామ్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

## సిపిఎం మండల కార్యదర్శి గా బుర్రు అనిల్ కుమార్

**పాలకుల నిర్లక్ష్యం వల్లే అడ్డ గూడూరు మండలం వెనుకబాటు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్**




**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి అక్టోబరు 04:** అడ్డ గూడూరు మండల కేంద్రంలోని ఎం ఆర్ ఫంక్షన్ హాల్ లో సిపిఎం మండల మూడోవ మహాసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహాసభలో బుర్రు అనిల్ కుమార్ ను అడ్డ గూడూరు మండల సిపిఎం కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కొరకై ఇంటింటికి సిపిఎం అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలో అన్ని మండలాల్లో సిపిఎం మహాసభలు నిర్వహిస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం ఇప్పుడు పాలిస్తున్న పాలకుల నిర్లక్ష్యం వల్లే అడ్డ గూడూరు మండలం వెనుకబడిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇంతవరకు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు . అడ్డ గూడూరు మండలం ఏర్పాటై పది సంవత్సరాలైనా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవన్నారు. అడ్డ గూడూరు మండలం అభివృద్ధి కొరకు సిపిఎం పార్టీ తరపున పోరాడుతామని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి పాండు, వల్లంబట్ల శ్రీనివాసరావు చిత్తలూరు మల్లయ్య శ్రీరామ శ్రీను గూడెపు ఎల్లయ్య సిపిఎం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అభయ హస్త హనుమాన్ దేవాలయం దుర్గాదేవి మండపంలో కుంకుమ పూజలు



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి అక్టోబరు 04:** మెట్ పల్లి పట్టణంలో వెల్లుల్ల రోడ్ అభయ హస్త హనుమాన్ గుడి దగ్గర హనుమాన్ నగర్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపంలో శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గాదేవికి కుంకుమ పూజ చేసారు. హనుమాన్ నగర్ మాతలు భక్తి శ్రద్ధలతో లలితా సహస్ర నామాలు రాత్రి బతుకమ్మ డాండియా భజనలు కొనసాగుతున్నాయి.

## ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుంది



**మెట్ పల్లి డిఎస్పి ఉమామహేశ్వరరావు**

**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి అక్టోబరు 04:** ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని మెట్ పల్లి డిఎస్పీ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని సమావేశ మందిరంలో జపాన్ కరాటే ఫోటో ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలంగాణ స్టేట్ చీఫ్ ఇన్స్ట్రక్టర్ ఎంఎస్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ బెల్ట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా హాజరైన మెట్ పల్లి డిఎస్పీ ఉమామహేశ్వరరావు

సీఐ నిరంజన్ రెడ్డి ల చేతుల మీదుగా బెల్టు లో ప్రశంసా పత్రాలు అందజేశారు అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక కరాటే దశ నుండి నేర్చుకున్నట్లయితే శారీరక దృఢత్వం మానసికోల్లాసంతో పాటు ఆకతాయిల నుండి తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుండి కరాటే నేర్పించాలని సూచించారు

ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ ప్రభాకర్ ఆల్ రౌండర్ పిడి గంగాధర్ సూపర్ ఇండెంట్ నరసింహారెడ్డి విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి ప్రెస్ క్లబ్ జర్నలిస్టు కుటుంబాల భరోసా కు ఇన్సూరెన్స్

**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి అక్టోబరు 04:** జర్నలిస్టు కుటుంబాల భరోసా కోసం ఇన్సూరెన్స్ పాలసీ ఉపయోగ పడుతుందని టి యు డబ్ల్యు జే ఐజేయు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఆగ సురేష్ సంజీవ్ లు అన్నారు.

శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేయించిన నూతన రీనివల్ 40 పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీ బాండ్ పేపర్లను సభ్యులకు పంపిణీ చేశారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో రాత్రి పగలు అని తేడా లేకుండా ఆయా ప్రాంతాలకు వెళుతుంటారని అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు ఇన్సూరెన్స్ పాలసీ బాసటగా నిలుస్తుందనే ఉద్దేశ్యంతో ప్రెస్ క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ పాలసీ చేయించడం జరిగిందని అన్నారు. జర్నలిస్టులకు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు దాసం కిషన్ ఉపాధ్యక్షులు మాసుల ప్రవీణ్ మహ్మద్ అజీమ్ సంయుక్త కార్యదర్శి జంగం విజయ్ కోశాధికారి మక్సూద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిల్ పాషా జోరిగే శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు ఎస్ కే సాజిద్ ఆదిల్ పాషా ఎండి అఫ్రోజ్ మహేందర్ దీకొండ మురళి బాశెట్టి హరీష్ అజ్మీరా గంగాధర్ నాయక్ మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి జర్నలిస్టు లకు అండగా ప్రెస్ క్లబ్

**మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు..ఆగ సురేష్ భూరం సంజీవ్**



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి అక్టోబరు 04:** ఆపదలో ఉన్న జర్నలిస్టు లకు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా (టీయూడబ్ల్యూజే ఐజేయు) అండగా నిలుస్తుందని మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఆగ సురేష్ భూరం సంజీవ్ లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దాసం కిషన్ కు ప్రెస్ క్లబ్ తరుపున ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇది వరకు దాదాపుగా పది మంది జర్నలిస్టులకు వివిధ రకాలుగా సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాసుల ప్రవీణ్ మహ్మద్ అజీమ్ సంయుక్త కార్యదర్శి జంగం విజయ్ కోశాధికారి మక్సూధ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జోరిగే శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు ఎస్ కే సాజిద్ ఆదిల్ పాషా ఎండి ఆఫ్రోజ్ మహేందర్ దీకొండ మురళి బాశెట్టి హరీష్ మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

## అండర్ 19 తైక్వాండో పోటీలలో మాస్ట్రో కళాశాల విద్యార్థిని కి గోల్డ్ మెడల్



**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి అక్టోబరు 04:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని స్థానిక మాస్ట్రో కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బోడ నందిని అను విద్యార్థిని నేడు జగిత్యాలలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 19 తైక్వాండో కరాటే పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ తెలిపారు విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఒక్క బస్సు తప్ప ఆరు గ్యారెంటీలు తుస్సే

-మొదటిపేజీ తరువాయి

రుణమాఫీ కాలేదు. రేవంత్ రెడ్డి ఇంకెప్పుడు చేస్తావ్. నీకు చెవులు, కళ్ళు ఉంటే చేయ్. రైతుల మీద మిత్తి పడుతున్నది. నువ్వు మాఫీ చెయ్యకుంటే పరిస్థితి ఏం కావాలి..? రెండు లక్షల రుణమాఫీ కాలేదని మహబూబాబాద్‌లో రవి ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లాకు చెందిన సురేందర్ రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే రేవంత్ రెడ్డి కనిపించడం లేదా..? రైతుల కన్నీళ్లు చూస్తే రాతి గుండెలు కూడా కరుగుతాయి కానీ రేవంత్ రెడ్డి గుండె మాత్రం కరగడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కరోనా సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆపి.. రైతులకు మాత్రం రైతుబంధు ఆపకుండా కేసీఆర్ నిధులు విడుదల చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్‌ది రైతు గుండె. అందుకే రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ చేశారు కేసీఆర్. అన్ని పంటలకు బోనస్ అని ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తున్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ప్రభుత్వం చేసిన మోసాలను ప్రతిపక్షంగా వెంటపడి అడుగుతాం. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు అన్నడు. పది నెలల్లో ఎన్ని ఇచ్చినవ్. కేసీఆర్ పరీక్షలు పెట్టిన 30,000 ఉద్యోగాలు తప్ప నువ్వు ఇచ్చిందేమీ లేదు. మిగిలిన రెండు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు నింపుతావా..? డీఏలు ఇవ్వక ఉద్యోగులను మోసం చేసిండు. అన్ని వర్గాలకు రేవంత్ రెడ్డి అన్యాయం చేసిండు. రైతులేవరు అధైర్య పడొద్దు. బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి మెడలు వంచి మీకు రుణమాఫీ అమలు చేయిస్తాం అని హరీశ్‌రావు హామీ ఇచ్చారు.

**రేవంత్ రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడు అని తేలిపోయింది**

పది నెలల ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు.. ఆయన మొనగాడు కాదు మోసగాడు అని తేలిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు. రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది. కొమరెల్లి మల్లన్న, యాదాద్రి, భద్రాద్రి, సమ్మక్క – సారలమ్మ మీద ఒట్టు పెట్టి మొనగాడు లెక్క మాట్లాడిండు. కానీ ఇప్పుడు ఆయన మోసగాడు అని తేలిపోయింది. రైతు బంధు, రుణమాఫీ, పింఛన్లు, మహాలక్ష్మి అన్ని చేస్తా అన్నాడు. ఇప్పుడు సప్పుడు లేదు. మొత్తం రుణమాఫీ అయ్యింది రాజీనామా చేయ్ హరీష్ రావు అని సవాల్ విసిరిండు. మరి రుణమాఫీ అయితే ఇంత మంది రైతులు ధర్నాకు ఎందుకు వచ్చారు..? పాలకుర్తి మండలంలోనే 4314 మందికి రుణమాఫీ కాలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. మిగతా వారికి కాలేదు అన్నడు. చెప్పిన 22 లక్షల మందిలో కూడా కొందరికి పూర్తిగా రుణమాఫీ కాలేదు. రకరకాల కారణాలతో రుణమాఫీ ఆపే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. 31 సాకులు పెట్టి రుణమాఫీ ఎగబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. రేవంత్ మోసగాడు అని రైతులు, ప్రజలు అంటున్నారు అని హరీశ్‌రావు తెలిపారు.

## ఏదైనా పథకాన్ని ఆపి అయినా ఈ హామీలు నెరవేరుస్తాం

-మొదటిపేజీ తరువాయి

చేసి తీరుతామన్నారు. ఏ ఒక్క రైతు అధైర్యపడవద్దన్నారు. దేశంలో ఎక్కువ పంటలను సాగు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణయే అన్నారు. మన రాష్ట్రంలో ఒక కోటి 45 లక్షల టన్నుల వరి ధాన్యం పండిస్తున్నట్లు చెప్పారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు.

## కాంగ్రెస్ ట్రాప్‌లో బీఆర్ఎస్...

-మొదటిపేజీ తరువాయి

ఫైర్ బ్రాండ్ నేతగా పేరుంది. ఆమె రాజకీయ విమర్శలు చేశారు కానీ ఎప్పుడూ వివాదాస్పదం కాలేదు. కానీ తొలి సారిగా ఆమె కేటీఆర్ ఇష్యూలో నాగార్జున కుటుంబాన్ని, హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ను తీసుకు వచ్చారు. మామూలుగా ఆరోపణలు చేస్తే.. పెద్దగా ఎఫెక్ట్ ఉండదేమో కానీ.. ఆమె చెప్పిన విధానం బీఆర్ఎస్ నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తుంది. చాలా విడమర్చి చెప్పారు. ఆమ చేసిన వ్యాఖ్యలు క్షణాల్లోనే వైరల్ అయిపోయాయి. అలాంటి గాసిప్స్ సోషల్ మీడియాలో ఇప్పటికే చెప్పుకుంటూ ఉండటంతో ఇక వాటికి తిరుగులేకుండా పోయిది. కానీ కొండా సురేఖ

# స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు

# విగ్రహావిష్కరణ లో వికసించిన ఐక్యతా రాగం





**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి అక్టోబరు 04:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ శివారులోని పెద్ద గుండు వద్ద గల పశు వైద్య కళాశాల ఆవరణలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రూపు రాజకీయాలు లేవు మేమంతా ఒకటే అని చాటి చెప్పారు . కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ్ రావు పిలుపు మేరకు మెట్ పల్లి ప్రాంతానికి సంబంధించిన కాంగ్రెసు నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ కల్వకుంట్ల సుజిత్ రావు చెన్నమనేని శ్రీనివాసరావు కాటి పల్లి శ్రీనివాస్ రెడ్డి లు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై ఐకమత్యాన్ని చాటారు కోరుట్ల నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నది అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి వాకిటి సత్యం రెడ్డి కూన గోవర్ధన్ మాజీ జెడ్పిటిసి ఆకుల లింగారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షాకీర్ సిద్ధికి మెట్ పల్లి మాజీ సర్పంచ్ పూదరి నర్సాగౌడ్ మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లింగం మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి మహమ్మద్ రైసుద్దీన్



సంగు గంగాధర్ యువజన కాంగ్రెస్ నాయకుడు పెంట ప్రణయ్ పుల్లూరి వెంకటేష్ రుత్త నారాయణ తదితరులు పాల్గొన్నారు

# సరికొత్త వ్యూహం

-మొదటిపేజీ తరువాయి

జవాబు ఇస్తామంటోంది. విపక్షాల విమర్శలను ఎలా తిప్పికొట్టాలనే దానిపై మేధోమధనం చేస్తోంది. అందుకోసం సరికొత్త వ్యూహంతో ముందుకెళ్లాలని చూస్తోంది కాంగ్రెస్. విపక్షాల వ్యూహాలను చిత్తు చేసేందుకు సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేసుకుంటోంది.కార్పొరేషన్ ఛైర్మన్ల సమావేశంలో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ప్రధానంగా ఒక అంశాన్ని బలంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పదేళ్ల తర్వాత కార్యకర్తలు బలంగా పోరాడి సాధించిన అధికారాన్ని కలిసి కట్టుగా నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని సెంటిమెంట్‌ను రగిలించారట. ప్రభుత్వం అనేక మంచి పనులు చేస్తున్నా..వాటిని జనంలోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో విఫలమవుతున్నామనే అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసినా అనుకున్నంత పాజిటివ్ రాకపోగా..జనంలో నెగిటివ్ అవుతున్నామని ప్రస్తావించారు. రుణమాఫీ కాని రైతులకు కూడా త్వరలో రుణమాఫీ చేస్తామనే భరోసా క్యాడర్‌కు కల్పించాలని నేతలకు దిశానిర్దేశం చేశారట. ఇక హైడ్రా విషయంలో విపక్షాలు చేస్తున్న



ప్రచారాన్ని తిప్పికొట్టడంలో విఫలమవుతున్న విషయాన్ని కూడా చర్చించారు. చెరువులు, పార్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ విషయంలో ప్రజల్లో పాజిటివ్ చర్చ జరిగేలా ప్రయత్నించాలని సీఎం, పీసీసీ చీఫ్ నేతలకు దిశానిర్దేశం చేశారు.ఇక మూసీ సుందరీకరణ విషయంలో పార్టీ గొంతు ఏమాత్రం జనంలోకి పోవడం లేదని అటు సీఎం, ఇటు పీసీసీ చీఫ్ ఇద్దరూ ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ విషయంలో గతంలో బీఆర్ఎస్, బీజేపీలు చెప్పిన హామీలను జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. పేదలు, మధ్య తరగతి ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందనే భరోసా కల్పించడంలో వెనకబడిపోయామన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ కూడా సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాలను జనంలోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో పార్టీ ముందుండాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు సమిష్టిగా పనిచేస్తేనే త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి రిజల్ట్ వస్తుందని లేకపోతే పరిస్థితి చేయిదాటి..అందరూ మునిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో అపోజిషన్‌ను ఎదుర్కునేందుకు కాంగ్రెస్ వేస్తున్న యాక్షన్ ఎంత వరకు వర్కౌట్ అవుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# వినయ్ భాస్కర్‌కు బిగిస్తున్న ఉచ్చు

**వరంగల్ :** ఓరుగల్లు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య సవాళ్ల పర్వం నడుస్తోంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు కేంద్రంగా ఈ ఛాలెంజ్ ల పర్వం మొదలైంది. కేటీఆర్ వ్యాఖ్యలతో మొదలైన ఈ పొలిటికల్ ఎపిసోడ్ పరస్పర దాడుల వరకూ వెళ్ళింది. నయీం నగర్ నాలాకు సంబంధించి ఎమ్మెల్యే నాయిని సవాల్‌ని స్వీకరించని బీఆర్ఎస్ నేతలు. ఆ మరుసటి రోజు అక్కడకి వెళ్లి హడావుడి చేశారు. ఆ క్రమంలో బీఆర్ఎస్ నేతలపై తీవ్ర ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే నాయిని.. పేదల దగ్గర కబ్జా చేసిన భూములు తిరిగివ్వడానికి పదిరోజులు డెడ్ లైన్ విధించడం పొలిటికల్ హీట్ మరింత పెంచింది.తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండవ కీలకమైన నగరం వరంగల్. అలాంటి సిటీ గత కొన్ని సంవత్సరాలుగా చిన్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతూ కాలనీలన్నీ నీట మునుగుతున్నాయి. 2022లో కురిసిన వర్షాలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లోని సుమారు 38 కాలనీలు నీట మునిగి వేల మంది పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చింది. రెండవ రాజధానిగా పేరు ఉన్నప్పటికీ మౌలిక వసతులు కల్పన ముంపు సమస్యను తీర్చడంలో, గత పదేళ్లుగా బిఆర్ఎస్ నిర్లక్ష్యం వహించింది. అసెంబ్లీ ఎన్నికల ముందు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో మౌలిక వసతుల కల్పన కేంద్రంగానే రాజకీయాలు నడిచాయి. ఆ క్రమంలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి కి భారీ మెజార్టీ గెలిపించారు హన్మకొండ ఓటర్లు.హనుమకొండ జిల్లాలో ప్రధాన సమస్య నయింనగర్ నాలా ముంపు సమస్య.. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాలా వెడల్పు. రిటైనింగ్ వాల్ నిర్మాణం. నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికగా మొదలు పెట్టించి రికార్డు సమయంలో పూర్తి చేయించారు అంతేకాకుండా పదేళ్లుగా నిర్లక్ష్యంగా నడుస్తున్న కాళోజి కళాక్షేత్రాన్ని పూర్తి చేయించారు. మొత్తంగా గత పదేళ్ల నిర్లక్ష్యానికి 10 నెలల కమిట్మెంట్ కు తేడా చూడండి అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తవుతుండటంతో వాటి క్రెడిట్



దక్కించుకోవాలని బీఆర్ఎస్ చూస్తుండటం విమర్శల పాలవుతుంది.. టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పూర్తైన పనులన్నీ తన హయాంలోనే జరిగినట్లు ప్రచారం చేయడం మొదలుపెట్టారు. అంతేకాకుండా హనుమకొండ జిల్లా సమీక్ష సమావేశంలో స్వయంగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ ఎమ్మెల్యే తాను చేసినట్లుగా చెప్పుకొని పూలాభిషేకాలు చేసుకుంటున్నారని వ్యంగ్యంగా మాట్లాడారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యేని వాడు వీడని ఏకవచనంలో సంభోదించడం వివదాస్పదంగా మారింది.కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నయింనగర్ నాలా పనులు ఎవరు చేశారో నిరూపించాలని ఛాలెంజ్ విసిరారు. 29వ తేదీన 10 గంటలకు నయింనగర్ బ్రిడ్జి పైకి కేటీఆర్ వస్తే, ఎవరిపై ప్రజలు రాళ్ళేస్తారో, ఎవరిపై పువ్వులు వేస్తారో చూద్దామని సవాల్ విసిరారు. చెప్పినట్లుగానే నాయిని రాజేందర్ రెడ్డి నయింనగర్ బ్రిడ్జిపైకి స్థానికులతో కలిసి వెళ్ళారు. కేటీఆర్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ మహిళలు చీరె, గాజులు సైతం తీసుకెళ్ళి, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని కేటీఆర్ కు, బీఆర్ఎస్ శ్రేణులను హెచ్చరికలు జారీ చేశారు? బీఆర్ఎస్ శ్రేణుల కోసం ఎమ్మెల్యే నాయిని గంటసేపు బ్రిడ్జిపై ఎదురుచూసినా వారు స్పందించలేదు. ఆ క్రమంలో పార్టీ ఆఫీసు కోసం పార్కును కబ్జా పెట్టిన వారు అబద్దాల ప్రచారాలు చేసుకుంటున్నారని నాయిని తీవ్ర స్థాయితో మండిపడ్డారు.అయితే మరసటి రోజు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ తన అనుచరులతో ర్యాలీగా నయీమ్ నగర్ బ్రిడ్జి పైకి వచ్చి బ్రిడ్జి నిర్మాణానికి నిధులను గత సర్కారీ విడుదల చేసిందని తాను బ్రిడ్జి నిర్మాణం మొదలుపెట్టే లోపే ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని బ్రిడ్జి క్రెడిట్ ను తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేశారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని దోచుకున్న సొమ్మును విదేశాలకు తరలిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ క్రమంలో కాంగ్రెస్ శ్రేణులు సైతం బ్రిడ్జి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేయగా, సీఎంకు, ఎమ్మెల్యే నాయనికి వ్యతిరేకంగా టిఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. దాంతో రెండువర్గాలు ఒకరిపై ఒకరు దూసుకొచ్చి ఘర్షణకు దిగడంతో పోలీసులు ఎంట్రీ ఇచ్చి చెదరగొట్టారు. సుమారు గంట పాటు నయీమ్ నగర్ బ్రిడ్జి వద్ద హైడ్రామా నడిచింది. చివరకు మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తతకు తెరపడింది.మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ చేసిన వ్యాఖ్యలకు మరోసారి ఎమ్మెల్యే నాని నాగేందర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బీసీ పేరు చెప్పుకొని బీసీలను అణగతొక్కిన చరిత్ర వినయ్ భాస్కర్‌దని మండిపడ్డారు. తనపై చేసిన ఆరోపాలను నిరూపించాలని మరోసారి సవాల్ విసిరారు. వినయ్ భాస్కర్ చరిత్ర బయటపెడితే మద్రాస్ కు పారిపోవాల్సిందేనని ఫైర్ అయ్యారు. పదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని పేదల దగ్గర దోచుకున్న భూములను తిరిగి వారికివ్వాలని.. దానికి పది రోజుల డెడ్‌లైన్ విధించారు .. లేకుంటే వినయ్ భాస్కర్ బాధితుల సంఘం ఏర్పాటు చేసి ప్రజల ముందు తన చరిత్రను బయటపెడతానని తీవ్ర హెచ్చరికలు చేశారు.పదేళ్ళు అభివృద్ధిని పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు, 10 నెలల కాంగ్రెస్ పాలనలో పనులు పూర్తి చేయగానే, ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టాయనే చర్చ హన్మకొండలో జరుగుతోంది. అభివృద్ధి పనుల అంశం పక్కనపెడితే బీఆర్ఎస్ నేతల అవినీతి అక్రమాలను ఎమ్మెల్యే నాయిని ఒక్కొక్కటిగా బయటపెడుతుండటంతో ఎరక్కపోయి, ఇరుకున్నమనే భావన బీఆర్ఎస్ శ్రేణుల్లో వ్యక్తమవుతుంది.

# నాకో పదవి అంటున్న సోము

**రాజమండ్రి :** సోము వీర్రాజు.. పరిచయం అక్కర్లేని పేరు. ఆయన ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నన్నాళ్లూ జగన్ భజన చేసి తరించారు. జగన్ అడ్డగోలు నిర్ణయాలను, విధానాలనూ రాజును మించిన రాజభక్తి అన్న స్థాయిలో మద్దతు తెలిపి పునీతులయ్యారు. ఒక సమయంలో ఆయన బీజేపీ అధిష్ఠానానికి రాసిన లేఖలో అప్పట్లో రాష్ట్రంలో విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు కారణంగా ఏపీలో బీజేపీ పరిస్థితి నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్నట్లుగా తయారైందని పేర్కొన్నారు. ఆయన ఆ లేఖ రాసిన సమయంలో తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అధికారంలో లేదు.. అధికారంలో ఉన్న వైసీపీతో సోము వీర్రాజు అంటకాగుతున్నారు. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. ఆ హోదాలో ఉన్న ఆయన రాష్ట్ర పార్టీ బలహీనం కావడానికి విపక్ష నేత కారణం అంటూ అధిష్ఠానానికి లేఖ రాయడాన్ని బీజేపీ శ్రేణులే తప్పుపట్టాయి. అదొక్కటే కాదు.. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నంత కాలం ఆయన టార్గెట్ తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నట్లుగా విమర్శలతో చెలరేగిపోయారు. జగన్ కు వంత పాడటం కోసం ఆయన ఒంటెత్తు పోకడలకు పోయారు. అప్పట్లో ఆయన తీరును సొంత పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులే జీర్ణించుకోలేకపోయారు. రాష్ట్రంలో అంతంత మాత్రంగానే ఉన్న బీజేపీని కనీసం ఉనికి మాత్రంగా కూడా లేకుండా చేయడమే లక్ష్యమా అన్నట్లుగా అప్పట్లో సోము వీర్రాజు తీరు



ఉండేది. సోము వీర్రాజు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీజేపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రం నుంచి ఒక ప్రతినిధి వర్గం హస్తినకు వెళ్లి మరీ సోము వీర్రాజుపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసింది. దానిపై సీరియస్ గా స్పందించిన బీజేపీ హైకమాండ్ వెంటనే పార్టీ రాష్ట్ర వ్యవహారల ఇన్ చార్జ్, అప్పటి కేంద్ర మంత్రి మురళీధరన్ ను రాష్ట్రానికి పంపింది. ఆయన నేరుగా రాజమహేంద్ర వరం వచ్చి పార్టీ నేతలతో బేటీ అయ్యారు. ఈ భేటీలో కూడా సోము వీర్రాజుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అప్పట్లో ఏపీలో జగన్ ప్రభుత్వ అవినీతిపై చార్జిషీట్ దాఖలు చేయాలని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశించినా సోము వీర్రాజు నేతృత్వంలోని పార్టీ రాష్ట్ర శాఖ ఆ పని చేయలేదు. ఇదంతా ఎందుకుంటే సోము వీర్రాజు ఎంతగా జగన్ భజనలో తరించారో చెప్పడానికే. అటువంటి సోము వీర్రాజు ఇప్పుడు స్వరం మార్చేశారు. చంద్రబాబు భజనకు రెడీ అయిపోయారు.

తిరుమలలో స్వచ్ఛమైన లడ్డు తయారు చేసి భక్తులకు అందించే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని చెప్పారు. అందుకు చంద్రబాబు తరపున తానూ పూచీ అని వాక్రుచ్చారు. తిరుమల వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధోరణి హేయం అని విమర్శలు గుప్పించారు. జగన్ అధికారంలో ఉండగా మంచి చెడూ మరిచి ఆయనతో అంటకాగిని సోము వీర్రాజును ఇప్పుడు బీజేపీలో పట్టించుకునే నాథుడే లేరు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామే. ఏదో ఒక నామినేటెడ్ పోస్టు, కనీసం ఎమ్మెల్సీ అంటూ సోము వీర్రాజు వెంపర్లాడుతున్నా బీజేపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. దీంతో మళ్లీ పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడానికే సోము వీర్రాజు స్వరం మార్చారని బీజేపీ శ్రేణులే అంటున్నాయి. ఇక తెలుగుదేశం వర్గాలైతే సోము వీర్రాజును వీర లెవెల్లో ట్రోల్ చేస్తున్నాయి.

# తమ్మినేని దారెటు...


**శ్రీకాకుళం :** పాలిటిక్స్ ఈజ్ ఆల్వేస్ ఇంట్రెస్టింగ్. పైగా పేరున్న నేత పదవిలో ఉన్నా లేకపోయినా హాట్ టాపికే. ఏపీలో అలాంటి కటౌటే తమ్మినేని సీతారాం. ఫైర్ బ్రాండ్‌గా..పదవి ఉన్నా.. లేకపోయినా..తనకంటూ ఓ సెపరేట్ స్టైల్ ఉంటుంది. ప్రత్యర్థులపై మాటల తూటాలతో విరుచుకుపడుతుంటారు. అలాంటి సీనియర్ నేతకు ఇప్పుడు కొత్త కష్టం వచ్చి పడిందట. దశాబ్దాలుగా తను కంచుకోటగా తయారు చేసుకున్న నియోజకవర్గం చేజారిపోతుందన్న భయం వెంటాడుతోందట. ఐదుసార్లు ఎమ్మెల్యేగా..మంత్రిగా, ఏపీ శాసనసభాపతిగా..పనిచేశారు తమ్మినేని సీతారాం. మూడు దశాబ్దాలుగా ఆమదాలవలస నియోజకవర్గాన్ని తన అడ్డాగా మార్చుకున్నారు. అయితే ఆయన 2019లో ఎమ్మెల్యేగా గెలిచి స్పీకర్ అయిన తర్వాత ఆమదాలవలస నియోజకవర్గంలో పరిస్థితులు మారుతూ వచ్చాయి. స్వపక్షంలోనే విపక్షం తయారైంది. సీతారాం గెలుపు కోసం కష్టపడ్డ నేతలే ఆయనపై తిరుగుబాటు చేశారు. సువ్వారిగాంధీ లాంటి సీనియర్ నేత.. ఏకంగా తమ్మినేని సీతారాంపై రెబల్‌గా పోటీ చేశారు. నియోజకవర్గంలో సొంత



పార్టీలో వ్యతిరేకతకు తమ్మినేని కుటుంబ సభ్యులే కారణమన్న టాక్ జిల్లాలో గట్టిగా వినిస్తోంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లా ముఖ్యనేతలతో వైసీపీ అధినేత జగన్ సమావేశం అయ్యారు. ఆ మీటింగ్ తర్వాత తమ్మినేని సీతారాంకు శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. తమ్మినేనిని వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ బరిలో దించుతారని.. ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతలు కొత్త నాయకుడికి అప్పగించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోందంటూ వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తమ్మినేని సీతారాం కొడుకు చిరంజీవి నాగ్ ఆమదాలవలస రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నారు. అయితే అనేక మంది వైసీపీ ద్వితీయస్థాయి నేతలు చిరంజీవి నాగ్ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆమదాలవలసకు కొత్త నాయకుడు కావాలన్న చర్చ క్యాడర్‌లో గట్టిగానే నడుస్తోంది. వయస్సు రిత్యా తమ్మినేని వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అన్నది కూడా డౌట్. దీంతో తన కుమారుడ్ని ఎలాగైనా ఆమదాలవలస నుంచి బరిలో దించాలన్న ప్లాన్ చేస్తున్నారట. స్థానిక నాయకుల నుంచి మాత్రం వ్యతిరేకత వ్యక్తం అవుతుండటంతో..తన వారసుడి రాజకీయ భవితవ్యంపై తెగ బెంగ పెట్టుకున్నారట. తాను నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉంటేనైనా కొడుకుకు టికెట్ కోసం ఫైట్ చేసే వాడినని.. తనను పార్లమెంట్ ఇంచార్జ్‌గా వేశారని బాధ పడుతున్నారట. మరి నియోజకవర్గంపై ఉన్న పట్టుతో కొడుకుకే ఇంచార్జ్ బాధ్యతలు వచ్చేలా లాబీయింగ్ చేస్తారా లేక..ఆమదాలవలస నియోజకవర్గానికి తమ్మినేని సీతారం గుడ్ బై చెబుతారో వెయిట్ చేయాల్సిందే

# మూసి ముందుకు సాగేనా

**హైదరాబాద్ :** మూసీ సుందరీకరణ తెలంగాణలో రాజకీయ మంటలు రేపుతోంది. సుందరీకరణ చేసి తీరుతామని అధికార పార్టీ కుండబద్ధలు కొట్టి చెప్తుంటే.. పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లు కూల్చి ఎలా ముందుకు వెళ్తారో తాము చూస్తామంటూ విపక్షాలు సవాల్ విసురుతున్నాయి. మూసీ సుందరీకరణ.. తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన అంశం. కాంగ్రెస్ ఎబ బీఆర్ఎస్ గా మారిపోయింది ఈ ఇష్యూ. నార్సింగి టు నాగోల్. 55 కిలోమీటర్ల మేర రూపురేఖలు మార్చి కమర్షియల్ హబ్‌గా మార్చుతామని అంటోంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ క్రమంలో ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధమైంది. సుందరీకరణ పనుల్లో భాగంగా చాదర్‌ఘాట్ మూసీ పరిధిలో నదీ గర్భంలో ఉన్న ఇండ్లను అధికారులు కూల్చివేస్తున్నారు. ఇక్కడ ఉన్న 140 నిర్వాసిత కుటుంబాలను చంచల్‌గూడ డబుల్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్లలోకి తరలించారు..అయితే సర్కారు చర్యలపై ప్రతిపక్షాలు కన్నెర్ర చేస్తున్నాయి. ఇది అభివృద్ధినా? పేదలను రోడ్డు మీద వేయడమా అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అది బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వ చర్యలను విపక్షాలు తప్పుబడుతున్నాయి. అది బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్ అంటున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మూసీ ప్రాజెక్టు రాహుల్ డైరెక్షన్‌లో నడుస్తుందన్నారు. కర్ణాటక సీఎం స్కాంలో ఇరుకున్నారు. అక్కడ డిప్యూటీ సీఎం డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే తెలంగాణ నుంచి బంగారు బాతుగా మూసీ ప్రాజెక్టును ఎంచుకున్నారని ఖఖీ విమర్శించారు. కూల్చివేతల గందరగోళ వాతావరణంతో తెలంగాణలో పండుగ సందడే లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్ట్‌పై మా విజన్ ఏంటనేది.. రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామంటున్న కేటీఆర్, ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రభుత్వం దగ్గర డీపీఆర్ కూడా లేదంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కేసీఆర్ గతంలో 3 గంటల ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీపై ప్రభుత్వం 3 నిమిషాల వివరణ ఇవ్వగలదా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే మూసీ విషయంలో రాహుల్‌గాంధీని లాగడమెందుకు? ఏమైనా ఉంటే లోకల్‌గా మనం.. మనం చూసుకుందామంటున్నారు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయని కారణంగానే ప్రభుత్వం కక్ష కట్టిందని ఆరోపిస్తోంది బీఆర్ఎస్. దీనికి కౌంటర్ ఇచ్చిన మంత్రి



పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌పై ఏ పార్టీకి ప్రేమ ఉందో ప్రజలకు తెలుసన్నారు. కక్ష కట్టింది కాంగ్రెసా? బీఆర్ఎస్సా? అని ప్రశ్నించారు. మరోవైపు, కూల్చివేతలను అడ్డుకుని తీరుతామని అంటున్నారు కమలం పార్టీ నేతలు. లక్షన్నర కోట్లతో సుందరీకరణ అవసరమా? అంత బడ్జెట్ భరించే శక్తి రాష్ట్రానికి ఉందా? కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. అక్బరుద్దీన్‌తో కలిసి లండన్ వెళ్లి లండన్ మాదిరి చేస్తామంటే ఎలా కుదురుతుందని ప్రశ్నిస్తున్నారు. రోడ్లు వేసి, నీళ్లు ఇచ్చి, అనుమతులు ఇచ్చిన ప్రభుత్వమే కూలుస్తా అంటే ఎలా అంటున్నారు కిషన్ రెడ్డి. మూసీకి రిటైనింగ్ వాల్ కడితే సరిపోతుదంటున్న కేంద్ర మంత్రి.. కూల్చివేతలను అడ్డుకొని తీరుతామని అంటున్నారు. మూసీ బాధితులకు చంచల్‌గూడలో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లను స్థానిక ఓఎఓ ఎమ్మెల్యే బలాల తనిఖీ చేశారు. అక్కడ ప్రజలకు ఎలాంటి వసతులు కల్పించారన్న దానిపై ఆరా తీశారు. బాధితులందరికి అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి. అలా కాకుండా ఇల్లు కూలుస్తామంటే ఒప్పుకునేది లేదంటున్నారు. బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. మూసీ ప్రాజెక్ట్‌పై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. అసలు కేటీఆర్, హరీష్‌రావుకు మానవత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఒక్కసారి నల్లగొండకు వచ్చి ఇక్కడి పరిస్థితులు చూడాలన్నారు. అవసరం లేకున్నా బీఆర్ఎస్ మల్లన్నసాగర్ కట్టిందన్నారు మంత్రి కోమటిరెడ్డి. మీకు గోదావరి నీళ్లు.. మాకు మూసీ నీళ్లా? అని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా అంటే బీఆర్ఎస్‌కు ఎందుకంత కోపమో చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించినందుకు నల్లగొండపై పగబట్టారని ఆరోపించారు. సో.. ఇప్పుడు మూసీ అంశం హైదరాబాద్ దాటి.. తెలంగాణ జిల్లాలకు వెళుతోంది. అయినా ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతామంటోంది. కాని విపక్షాలు మాత్రం పేదలు ఇళ్లు కూల్చితే అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నాయి.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 14 మంది మావోయిస్టులు మృతి



ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. నారాయణ్‌పూర్ లి దంతెవాడ సరిహద్దుల్లో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో 14 మంది మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. బస్తర్ రేంజ్‌లోని దంతెవాడ, నారాయణ్‌పూర్ ంంంంజిల్లాల సరిహద్దుల్లో ఉండే అబూజ్‌మడ్ దండకారణ్యంలో మావోయిస్టులు నక్కి ఉన్నట్లు పోలీసులకు ముందుగా సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలను చూసిన మావోలు కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన సిబ్బంది ఎదురుకాల్పులకు దిగి.. 14 మంది మావోలను మట్టుబెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలం నుంచి భారీ ఎత్తున పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది.

## బీహార్‌లో మళ్లీ చెడుతున్న బీజేపీ-జేడీయూ బంధం



బీహార్‌లో బీజేపీ, జేడీయూ కూటమి మధ్య మరోమారు మాటల యుద్ధం మొదలైంది. ఇరు పార్టీల నేతలు చేస్తున్న ప్రకటనలతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. జేడీయూ నేత, మంత్రి జమాఖాన్.. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అజయ్ అలోక్ విభేదిస్తూ కనిపించారు. కేంద్రమంత్రిగా, దాదాపు 19 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీశ్ కుమార్ ఈ దేశానికి ప్రధాని అవుతారని, ఆయనను ప్రధానిని చేయడంలో ప్రతిపక్షాలు కూడా మద్దతునిస్తాయని జమాఖాన్ పేర్కొన్నారు. నితీశ్ కుమార్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే కాంగ్రెస్‌తోపాటు అన్ని పార్టీలు మద్దతునిస్తాయని తెలిపారు. బీహార్ మాత్రమే కాకుండా దేశం మొత్తం ఆయన ప్రధాని కావాలని కోరుకుంటోందని చెప్పారు. ఆయన ప్రధాని అయితే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆయనకు కుటుంబ నేపథ్యం లేదని, ఆయనపై ఎలాంటి మచ్చలేదని చెప్పుకొచ్చారు.

**ప్రధాని కుర్చీ ఖాళీ లేదు**

జమాఖాన్ చేసిన ఈ వ్యాఖ్యలు బీహార్‌లో కూటమి ప్రభుత్వం మధ్య విభేదాలకు కారణమయ్యాయి. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అజయ్ అలోక్ మట్లాడుతూ ప్రధాని పదవి ప్రస్తుతం ఖాళీగా లేదని అన్నారు. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లాను ఇజ్రాయెల్ చంపినప్పటి నుంచి ప్రజలు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారని చెప్పారు. జమాఖాన్ మంత్రి కాబట్టి నితీశ్‌ను ప్రధానిని చేసేందుకు కాంగ్రెస్ సహా ఇతర పార్టీలతో మాట్లాడాలని, వారికేం చెప్పాలో జమాఖాన్ కు నితీశ్ చెబుతారని పేర్కొన్నారు.

**బీజేపీ సంగతి జేడీయూకు అర్థమైంది**

మరోవైపు, బీజేడీ, బీజేపీ మధ్య మాటల యుద్ధంపై ప్రతిపక్ష ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ స్పందించారు. నితీశ్‌ను సీఎం సీటు నుంచి దింపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ విషయం జేడీయూకు అర్థమైంది కాబట్టే నితీశ్‌ను ప్రధాని చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ కనుక ఇలాంటి పిచ్చి ప్రయత్నం ఏదైనా చేస్తే కేంద్రంలో ఎన్డీయేకు ఇస్తున్న మద్దతును జేడీయూ ఉపసంహరించుకుంటుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి కుర్చీని డిమాండ్ చేయడానికి ముందు బీహార్‌లో నితీశ్‌ను రక్షించేందుకు జేడీయూ ప్రయత్నిస్తే మంచిదని హితవు పలికారు.

## షాంఘై సదస్సుకు పాక్ వెళ్తున్న జైశంకర్



**న్యూఢిల్లీ:** ఇస్లామాబాద్‌లో జరగనున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో పాల్గొనేందుకు భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పాకిస్థాన్ వెళ్తున్నారు. ఎస్‌సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ సమావేశాలు ఈనెల 15,16 తేదీల్లో జరుగనున్నాయి. ఈ సమావేశాలకు పాక్ నుంచి ఆహ్వానం అందినట్టు గత ఆగస్టు 30న ఒక ప్రకటనలో భారత్ ధ్రువీకరించింది. 2015 డిసెంబర్ అనంతరం భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌కు వెళ్లడం ఇదే మొదటిసారి. దివంగత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ 2015లో ఆఫ్ఘనిస్థాన్‌లో కాన్ఫరెన్స్ కోసం ఇస్లామాబాద్‌లో పర్యటించారు.
ఎస్సీవో సదస్సుకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. పాక్ నుంచి ఆహ్వానం అందినట్లు ఆగస్ట్ 30న కేంద్రం ధృవీకరించింది. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎస్సీవో సభ్య దేశాలకు చెందిన ప్రతినిధులు ఆయా దేశాల మధ్య ఆర్థిక, సామాజిక-సంస్కృతిక, మానవతా సహకారంపై చర్చించనున్నారు. ఎస్సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ రొటేటింగ్ చైర్మన్‌షిప్ ఈసారి పాకిస్థాన్‌కు వచ్చింది. శిఖరాగ్ర సమావేశానికి ముందు మంత్రి వర్గ సమావేశం, ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య ఆర్థిక, సామాజిక సంస్కృతి, మానవతా సహాయంపై దృష్టి సారించేందుకు సీనియర్ అధికారుల సమావేశాలు జరుగనున్నాయి.

**ఎస్సీఓ ప్రారంభం ఇలా..**

రష్యా, చైనా, క్రిజిగ్ రిపబ్లిక్, కజకిస్థా, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షులతో 2001లో షాంఘైలో జరిగిన సమావేశంలో ఎస్‌ఈఓ ఏర్పాటైంది. 2017లో ఇండియా, పాకిస్థాన్ శాశ్వత సభ్యులయ్యారు. గత జూలైలో ఎస్‌సీఓకు సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇచ్చింది. వర్చువల్ మీట్ నిర్వహించింది. ఇందులో పాకిస్థాన్ ప్రధాని ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పాల్గొన్నారు. ఇదే సమావేశంలో ఇరాన్‌కు శాశ్వత సభ్యత్వం ప్రకటించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com